# పూలపిల్ల

ధవళేశ్వరం ఆనకట్ట దిగువన వేమగిరి బ్రిడ్జి కట్టాక – ఆ బ్రిడ్జి కోనసీమకు ముఖద్వారమే అయింది.

ఆబ్రిడ్జి దాటి మాకారు లంకల మీదుగా కోనసీమవైపు సాయంత్రపువేళ అయిదు గంటలకు దూసుకుపోతోంది. అది మల్లె పూలసీజను కావడంతోనూ, రోడ్డుకు ఓ పక్కన మల్లెతోటలూ నర్సరీలు వుండటంతోనూ కారులో వున్నా చల్లని గాలితోపాటు తియ్యని పూల పరిమళాలు కూడా మమ్మల్ని వుక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

నల్లని రోడ్డువెంటే జతగా నిశ్శబ్దంగా ప్రవహిస్తోంది కాలువ.

రోడ్డుకి కుడిపక్క కాలువ ఎడమ పక్క చక్కని పూలతోటలు, నర్సరీలు చూసేకొద్దీ చూడాలనిపిస్తున్నాయి.

విరబూసిన పూల తోటల్ని చూస్తుంటే తారలతో సహా ఆకాశం నేలమీద పరచినట్లుంది. నక్షత్రాల్లా మెరుస్తున్న పూలు మొక్కలనే వుంటే ఎంతో అందగా వున్నాయి.

నర్సరీల లోని రంగురంగుల క్రోటన్సు మొక్కలు ప్రకృతి కన్య ఇంద్ర ధనస్సును చీరగా సింగారించుకున్నట్లుంది.

కారు ముందుకు దూసుకుపోతోంది.

ఎడమ పక్క పూలతోటలూ నర్సరీలతోబాటు ఒకటిరెండు కిలోమీటర్ల యెడంలో చిన్న చిన్న గ్రామాలూ, యిళ్లకు పోతున్నపశువులు, వాటివెనక పశువులకాపరులూ, అక్కడక్కడ మాట్లాడుకుంటూ రోడ్డు పక్క కూర్చున్న గ్రామస్తులు. చిన్న చిన్న దుకాణాలూ – రోడ్డు పొడువునా సందడిగానే వుంది.

గ్రామాల దగ్గర పూలదండలు చేతబట్టుకొని అమ్మచూపుతూ, వచ్చే పోయే కార్లకు, లారీలకు, బస్సులకు అడ్డుతగులుతున్న పూల పిల్లలు–

మాకారు ఓ చోట ఆ పాడు మా డ్రైవరు ఎవరో సోడాతాగాలంటేను. ఓపూల పిల్ల వచ్చేపోయేకార్లను కూడా లెక్కచేయకుండా మా కారుదగ్గరకు పరిగెత్తుకొచ్చింది.

'మల్లెపూలు అయ్యగారు! మల్లెపూలు–దండమూడు రూపాయలు' అంది పూలపిల్ల.

ఆపిల్ల వయసు పన్నెండేళ్ళుండొచ్చు.

పరికిణీ జాకెట్టులోవుంది. పిల్లమొహం నవ్వుముఖమే. దువ్వుకున్న తల రోడ్డు మీద పరుగులూ వురకలతో రేగిపోయినట్టుంది.

చేతిలో పదిమల్లెపూల దండలున్నాయి. కాని ఆపిల్ల తల్లోఒక్క మల్లెపూవూలేదు. ఆరేకంగా ఆ పిల్లను చూస్తే నాకే జాలనిపించింది. పూలంటే యిష్టపడని వాళ్ళు వుండరు. అందులోనూ ఆడపిల్లలకూ ఆడవాళ్ళకూ మరీ యిష్టం పూలంటేను. సాగినవాళ్ళు రోజూ పూలుపెట్టుకుంటారు జడలో. సాగనివాళ్ళు కథకో, కార్యానికో, పండక్కో, పబ్బానికో అయినా పెట్టుకుంటారు.

ఆ పిల్లలు పూలతోటల మధ్యబతుకుతూ పూలుకోస్తూ – పూల దండలు కడుతూ – పూలదండలు అమ్ముతూ – తలలో పూలుపెట్టుకోరు... పాపం – ఓ దండ అమ్మితే రెండు మూడురూపాయలు వస్తాయనే ఆశ పూలమీద మమకారాన్ని మింగేస్తుంది కామోసు.

నాపక్కనున్నతను 'పూలు మాకెందుకే పిల్లా! అందరం మొగాళ్లమేగా కార్లోవున్నది' అన్నాడు పెద్దతెలివిగా మాట్లాడినట్టు పోజుపెట్టి.

వెనుకసీటులో వున్నవాళ్ళు నవ్వారు.

"సేతికి కట్టుకోవచ్చుకదండీ" అంది ఆపిల్ల.

"జులాయివాళ్ళలా చేతికి పూలు కట్టుకోవడం ఏమిటి" అన్నాడు మాలో ఒకతను.

"పోనీ కారులో యేలాడదియ్యండి. యించక్కటి వాసనొత్తది. యింతవరకూ బోణీకూడా కాలేదు–" అంది బతిమాలుతున్నట్లు

పోనీలే! అని ఓదండ తీసుకున్నాను. రెండు రూపాయలిచ్చాను.

మాకారు ముందుకు కదిలింది.

"మొగవాళ్ళు చేతికి కట్టుకుంటే జులాయిలంటారు కదా ఆడవాళ్ళు తల్లో పెట్టుకుంటే ఏమీ అనరేమో" అనుకున్నాను.

మాకారు పూలతోటలు దాటి గోదావరి పాయల మీదున్న ఓ వంతెనను దాటింది.

మేము వెళ్ళవలసిన కూళ్ళకు కపిలేశ్వరం పురం వెళ్ళే యేటి గట్టుమీదుగా కారు నడుస్తోంది.

కూళ్ళగ్రామం చక్కటి గ్రామం. అక్కడ కోనసీమలో ఉండే కొబ్బరిచెట్లు, కాలువలు, పక్కన గోదావరి, పెద్ద పెద్దమండువాలోగిళ్ళు, గుడి, కోనసీమ బ్రాహ్మణ్యంవుండే అగ్రహారంవీధి – అన్ని హంగులూ గల గ్రామంఅది.

చిలకమర్తివారి 'గణపతి' టి.వి. సీరియల్ తీయడానికి అది అనువైన గ్రామం అని లొకేషన్ చూడ్డానికి అవూరుకి వెళ్ళాంమేమంతా.

లొకేషన్ బాగుందనుకున్నాం. నాకు తెలిసిన ఆ గ్రామపెద్దలతో సంప్రదించి వారి అంగీకారాన్ని తీసుకుని త్వరలో వస్తామని తిరిగి బయలుదేరాం అదేకారులో –

మాకు తిరిగి పూలపిల్లలు వున్న చోటికి రావడానికి రెండుమూడు గంటలు పట్టింది యేటి గట్టురోడ్డు బాగోక.

చీకటి పడింది.

వచ్చేపోయే కార్లలైట్లు, లారీలలైట్లు, అక్కడక్కడ గ్రామల్లో లైట్లతో అంత చీకటి అనిపించడంలేదు.

వెళ్ళేటప్పుడు పూల దండకొన్న చోటుకి మా కారు చేరుకునేసరికి - ట్రాఫిక్ జామ్ అయింది. ఓ చోట చుట్టూ జనం మూగారు.

"ఏం జరిగింది" అనడిగాను అక్కడున్న ఒకతన్ని.

"పూలమ్ముకునే పిల్ల లారీకింద పడిందండి"

"అయ్యో పాపం! బాగా దెబ్బలు తగిలాయా" అన్నాను.

"దెబ్బలు తగలడమేంటండి. ఏనుగంత లారీ పన్నెండేళ్ళపిల్లని గుద్దితే ఏమౌద్దండి. పిల్లనుగ్గునుగ్గైపోయిందండి" అన్నాడతను.

మనసు చివుక్కుమంది.

ఆ పిల్ల యిందాక నాకు పూలమ్మిన పిల్లకాకుండా వుంటే బాగుండుననుకున్నాను.

నేను పిల్లతో మాట్లాడింది ఒక నిమిషమే. కాని ఎందుకో పిల్ల నవ్వుముఖం, రేగిన జుట్టు, తల్లో పూలు లేకుండా చేతిలో దండలూ చూస్తే శాపగ్రస్తురాలు అనిపించింది నాకు. ఆ పిల్ల బతకాలనిపించింది. పెద్దదయ్యాకైనా తల్లో పూలు పెట్టుకొని చక్కగా సింగారించు కోవాలాపిల్లనిపించింది.

లారీ కిందపడ్డ పూలపిల్ల - నేను పూలు కొన్న అపూల పిల్ల కాకూడదని నామనసు మరీ మరీ వేదన పడుతోంది ఎందుకనో.

ఉండబట్టలేక కారుదిగాను. చుట్టూవున్న జనాన్ని తప్పించుకొని రక్తపుమడుగులో వున్న పిల్లను చూసాను. ముఖం ఆనవాలు దొరకలేదు. ఆకారమే మారిపోయింది.

కాని అదేరంగు జాకెట్టు

అదేరంగు పరికిణీ

పాపం ఆపిల్లే - అపూల పిల్లే

బతుకుకోసం బలైపోయిన ఆపిల్లని తల్చుకుంటే ఏదో బాధనిపించింది.

అంతచిన్న తనంలో రెండురూపాయలు సంపాదించు కోవడంకోసం అడ్డదిడ్డంగా పరుగెత్తి లారీ కింద పడిన ఆపిల్లను తల్చుకుంటే నా మనసు ఎక్కడెక్కడికోపోయింది.

కొన్నాళ్ళు కళ్ళు మూసినా తెరచినా పూలపిల్లే కనిపించింది.

నా కళ్ళ ముందు కన్ను మూసిన పూలపిల్ల కన్నుమూస్తే కనిపించేది.

మళ్ళీ మేం షూటింగుకెళ్ళాం కూళ్ళకు అదే దారిన.

చిత్రం - ఆ పిల్ల పోయినా, మిగిలిన పిల్లలు పూలు అమ్మడం మానలేదు.

వచ్చేపోయే కార్లకు అడ్డం పడ్డం మానలేదు.

జీవితపోరాటం ఆగలేదు.

బతుకు ఆరాటం ఆగిపోలేదు.

అదే జీవితం!!!

★ ★ ★